

ఇక పాటల జాతర

'పుష్ప-2' (ది రూల్) ప్రచార పర్వం క్రమంగా జోరందుకుంటున్నది. తొలిభాగానికి దేశవ్యాప్తంగా దక్కిన అపూర్వ ఆదరణ దృష్ట్యా ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ అప్‌డేట్ అభిమానుల్లో జోష్‌ను నింపుతున్నది. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. బన్నీ జన్మదినం సందర్భంగా విడుదల చేసిన టీజర్ సోషల్ మీడియాలో రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా పాటల ప్రమోషన్‌కు తెర లేవనుంది. దర్శకుడు సుకుమార్ పాటల రూపకల్పన మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనే విషయం తెలిసిందే. దాంతో 'పుష్ప-2' గీతాలు ఎలా ఉంటాయోననే ఆసక్తి సంగీత ప్రియుల్లో నెలకొని ఉంది. ఈ సినిమాలో 'పుష్ప పుష్ప పుష్పరాజ్..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను మే 1న విడుదల చేయబోతున్నారు. బుధవారం విడుదల చేసిన ప్రోమో ఆకట్టుకుంది. దేవిశ్రీప్రసాద్ స్వరాలందించిన ఈ సినిమా గీతాలు ప్రేక్షకుల అంచనాలను అందుకునేలా ఉంటాయని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాట్రోగఫీ: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: యస్.రామకృష్ణ-మోనిక నిగోత్రే, కథ, కథనం, దర్శకత్వం: సుకుమార్ బి.

భాగ్యనగరంలో 'తమ్ముడు' హంగామా

నితిన్ కథానాయకుడిగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'తమ్ముడు'. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో మొదలైంది. ఇందులో భారీ యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారని, దాదాపు 100 మందికిపైగా ఫైటర్స్ బృందం పాల్గొంటున్నదని సమాచారం. దాదాపు పది రోజుల పాటు ఈ షెడ్యూల్ జరుగుతుందని తెలిసింది. దిల్, శ్రీనివాస కల్యాణం వంటి సినిమాల తర్వాత దిల్ రాజు సంస్థలో నితిన్ చేస్తున్న ఈ సినిమా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. నితిన్ జన్మదినం సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నది.

నెగెటివ్ రోల్‌లో షారుఖ్

బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్ తన తదుపరి చిత్రం 'కింగ్' కోసం సన్నద్ధమవుతున్నారు. ఈ సినిమా ద్వారా ఆయన కుమార్తె సుహానా ఖాన్ థియేట్రికల్ ఎంట్రీ ఇస్తున్నది. సుజయ్‌ఘోష్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల పాత్రలకు కథాగమనంలో సమప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో షారుఖ్‌ఖాన్ పవర్‌ఫుల్ డాన్ పాత్రలో కనిపిస్తారని, ఆయన క్యారెక్టర్ నెగెటివ్ షేడ్స్‌తో సాగుతుందని సమాచారం. డర్, అన్జామ్, రేయిస్ చిత్రాల్లో షారుఖ్ ఖాన్ పోషించిన నెగెటివ్ పాత్రలకు మంచి గుర్తింపు దక్కింది. ఈ నేపథ్యంలో 'కింగ్' సినిమాలో ఆయన పాత్రను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ సినిమా క్రియేటివ్ ప్రాసెస్‌లో కూడా షారుఖ్‌ఖాన్ పూర్తిగా ఇన్‌వాల్వ్ అవుతన్నారని, తన కూతురు నటిస్తున్న తొలి థియేట్రికల్ సినిమా కాబట్టి అన్ని అంశాలు పర్‌ఫెక్ట్‌గా ఉండాలనే లక్ష్యంతో ఉన్నారని చిత్ర బృందం చెబుతున్నది. 'ది ఆర్చిస్' చిత్రం ద్వారా ఓటీటీ వేదికపై అరంగేట్రం చేసిన సుహానా ఖాన్..'కింగ్' సినిమాతో థియేట్రికల్ ఎంట్రీకి సిద్ధమవుతున్నది. ఆగస్ట్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.

'హనుమాన్' చిత్ర వందరోజుల వేడుకను మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర హీరో తేజ సజ్జా, దర్శకుడు ప్రశాంత్‌వర్మ, నిర్మాత కె.నిరంజన్ రెడ్డితో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. 'హనుమాన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 300కోట్ల వసూళ్లను సాధించిందని, దేశవ్యాప్తంగా 25 కేంద్రాల్లో వందరోజులు పూర్తి చేసుకుందని చిత్రబృందం పేర్కొంది.

సత్యభామ అన్వేషణ ఎవరికోసం?

కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్నారు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కళ్లపల్లి నిర్మాతలు. మే 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని 'కళ్లారా..' అనే మెలోడీ గీతాన్ని గురువారం విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుంది. 'క్రైమ్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. పోలీస్ అధికారిణిగా సత్యభామ అన్వేషణ ఎవరి కోసమన్నది ఉత్కంఠను పంచుతుంది. కాజల్ పాత్ర భిన్న కోణాల్లో సాగుతుంది. ఫ్యామిలీ సెంటిమెంట్ ఆకట్టుకుంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ప్రకాష్‌రాజ్, నవీన్ చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జి.విష్ణు, సంగీతం: శ్రీచరణ్ పాకాల, స్క్రీన్‌ప్లే, సమర్పణ: శశికిరణ్ తిక్క, దర్శకత్వం: సుమన్ చిక్కాల.

'కుబేర' షూట్‌లో రష్మిక

అగ్ర కథానాయిక రష్మిక మందన్న ప్రస్తుతం తెలుగులో వరుస సినిమాలతో బిజీగా ఉంది. పుష్ప-2, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో పాటు ధనుష్-నాగార్జున 'కుబేర' చిత్రాల్లో రష్మిక కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె 'కుబేర' సినిమా షూటింగ్‌లో జాయిన్ అయింది. ముంబయిలో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో ధనుష్-రష్మిక మందన్నలపై కీలక సన్నివేశాలను చిత్రీకరించబోతున్నారని సమాచారం. స్లమ్ ఏరియా బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. సమాజంలోని ఆర్థిక, సామాజిక అంతరాలను చర్చిస్తూ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమాలో రష్మిక మందన్న పాత్ర కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని, గత చిత్రాలకు భిన్నంగా సరికొత్త పంథాలో ఆమె పాత్ర సాగుతుందని అంటున్నారు. శ్రీవెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఆత్మ నేపథ్యంలో ప్రేమాయణం

ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ మీ'. అరుణ్ భీమవరపు దర్శకుడు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. 'ఇఫ్ యు డేర్' ఉపశీర్షిక. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'తెలుగు తెరపై ఇప్పటివరకూ రానటువంటి విభిన్నమైన ప్రేమ కథాంశమిది. ఓ ఆత్మ తాలూకు ప్రేమకథగా ఉత్కంఠను పంచుతుంది. దర్శకుడు తన నిజ జీవితంలో చూసిన సంఘటనల స్ఫూర్తితో ఈ కథ రాసుకున్నాడు. హారర్ అంశాలతో పాటు అంతర్లీనంగా హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలుంటాయి' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: వీసీ శ్రీరామ్, ఆర్ట్: అనివాష్ కొల్లా, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, దర్శకత్వం: అరుణ్ భీమవరపు.

ఇమేజ్ గురించి ఆలోచించను

'జీవితం అంటేనే రిస్క్. మనసుకు నచ్చిన పనులను చేస్తూ ముందుకుపోవాల్సిందే. ఈ ప్రయాణంలో జయాపజయాలను ఎవరూ అంచనా వేయలేరు. 'శబరి' ఓ విభిన్నమైన కథ. తప్పకుండా అందరికి నచ్చుతుంది' అని చెప్పింది వరలక్ష్మీ శరత్‌కుమార్. ఆమె ప్రధాన పాత్రలో అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన 'శబరి' చిత్రం మే 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ కథ వినగానే బాగా నచ్చింది. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. ఓ సాధారణ యువతి తన భర్తతో వచ్చిన విభేదాల వల్ల అతని నుంచి విడిపోతుంది. తన కుమార్తెను ఒంటరిగా పెంచుతుంది. కూతురికి మంచి జీవితాన్ని అందించాలని ప్రయత్నించే క్రమంలో ఆమెకు ఎదురైన సమస్యలు? వాటిని ఎలా అధిగమించిందన్నదే ఈ సినిమా కథ' అని చెప్పింది. తల్లి పాత్రను పోషించడం గురించి మాట్లాడుతూ 'తమిళంలో పొడా పొడి, పందెం కోడి-2 చిత్రాల్లో తల్లి పాత్రలు చేశాను. నేను నటనను ప్రేమిస్తాను. ఇమేజ్ పట్టింపులు లేకుండా ప్రేక్షకులను మెప్పించే పాత్రలు చేయాలన్నదే నా లక్ష్యం' అని పేర్కొంది. ఈ సినిమాలో తాను యాక్షన్ సీక్వెన్స్‌లో కనిపిస్తానని, అవి సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని, మదర్ సెంటిమెంట్ ప్రధానంగా ఈ సినిమా అందరిని ఆకట్టుకుంటుందని ఆమె తెలిపింది. పెళ్లి గురించి మట్లాడుతూ 'ఇటీవలే నిశ్చితార్థం జరిగిన విషయం మీ అందరికి తెలుసు. ఈ ఏడాది పెళ్లి వేడుక ఉంటుంది' అని వరలక్ష్మీ శరత్‌కుమార్ వెల్లడించింది.

కనులెందుకో కలిసేనులే..

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. 'ది రివోల్ట్' ఉపశీర్షిక. జ్ఞానసాగర్ దర్శకత్వంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. మాళవిక శర్మ కథానాయిక. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో పాటల ప్రమోషన్‌ను వేగవంతం చేశారు. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'కనులెందుకో..' బుధవారం విడుదలైంది. చైతన్ భరద్వాజ్ ఈ పాటను స్వరపరచడంతో పాటు నిఖితా శ్రీవల్లితో కలిసి ఆలపించారు. మెలోడీ ప్రధానంగా సాగిన ఈ పాటలో సుధీర్‌బాబు, మాళవిక శర్మ కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989లో జరిగిన యథార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా తీశానని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, నిర్మాత: సుమంత్ జి నాయుడు, రచన-దర్శకత్వం: జ్ఞానసాగర్ ద్వారక.

ఎమోషనల్ థ్రిల్లర్ 'ఆరంభం'

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్‌నాగ్ వి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏవీటీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై అభిషేక్ వీటి నిర్మిస్తున్నారు. మే 10న ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'వినూత్నమైన కథాంశంతో ఎమోషనల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయి. ప్రేక్షకులు ఓ విభిన్నమైన చిత్రాన్ని చూసిన అనుభూతికిలోనవుతారు. సమాజంలో జరిగిన యథార్థ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కించాను' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: దేవ్ దీప్‌గాంధీ కుందు, సంగీతం: సింజిత్ యెర్రమిల్లి, సంభాషణలు: సందీప్ అంగిడి, దర్శకత్వం: అజయ్‌నాగ్ వీ.

సకుటుంబ కథా చిత్రం

పృథ్వీ, రూపాలి, అంబిక హీరోహీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పాలిక్ శ్రీను దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్. క్రియేషన్స్, పాలిక్ స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ముహూర్తపు సన్నివేశానికి దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ క్లాప్‌నిచ్చి టీమ్‌ను అభినందించారు. దేశంలో అన్ని ప్రాంతాల నుంచి నటీనటులను తీసుకున్నామని, సున్నితమైన భావోద్వేగాలతో సాగే కుటుంబ కథా చిత్రమిదని, పాటలు కూడా బాగా కుదిరాయని దర్శకుడు పాలిక్ తెలిపారు. వచ్చే నెల 5 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని, దీపావళికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు దుర్గం రాజేష్, రావుల రమేష్, టీఎస్ రాజు తెలిపారు. ఆమని, ఝాన్సీ, అజయ్‌ఘోష్, షకలక శంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెంకట్-నిశాంత్, సంగీతం: జాన్ భూషణ్, సంభాషణలు: తోటపల్లి సాయినాథ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పాలిక్ శ్రీను.